సాక్షి
బాపట్ల
గురువారం । 3 । ఏప్రిల్ । 2025



కనులపండువగా తిరునాళ్ల

దాచేపల్లి: నడికుడిలో శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.



అయ్యప్పస్వామికి అభిషేకాలు

నగరం: స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానంలో బుధవారం పంచామృతాలతో అభిషేకాలను కనుల పండువగా నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట ఈస్ట్: యోగానంద లక్ష్మీనర సింహస్వామి ఆలయ రాతి నిర్మాణానికి బుధవారం లక్ష్మీప్రసాద్, పద్మప్రియ దంపతులు రూ. 3,01,116 విరాళంగా అందించారు.

న్యూస్‌రీల్

ఐఆర్‌ని వెంటనే ప్రకటించాలి: ఫ్యాప్టో



బాపట్ల : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే 30 శాతం ఐఆర్‌ని ప్రకటించాలని ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు సయ్యద్ చంద్‌బాషా ప్రభుత్వాన్ని కోరారు. ఫ్యాప్టో జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం బాపట్లలో కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ చంద్ బాషా మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు 12వ పీఆర్సీ, ఐఆర్ కోసం ఎదురు చూసినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు జీవో నంబరు 57 ద్వారా పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కలెక్టరేట్ వద్ద కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కె.పిచ్చయ్య, కె.వినయ్‌కుమార్, బత్తుల వెంకటేశ్వర్లు, బడుగు శ్రీనివాసరావు, అడుగుల శ్రీనివాసరావు, ఉదయశంకర్ పాల్గొన్నారు. నిరసన అనంతరం అధికారులకు వినతి పత్రం అందించారు.

రీసర్వే, పన్నుల వసూలు వేగవంతం చేయాలి



బాపట్ల: భూముల రీసర్వే, నీటి పన్ను వసూలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో ఆయన మాట్లాడారు. జిల్లాలో భూముల రీసర్వేని గడువులోపు పూర్తి చేసేందుకు అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. సాగునీటి పన్ను వసూలు చేయటానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలోజాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు.

నేడు కేతవరంలో ప్రతిష్టా మహోత్సవం



బెల్లంకొండ: మండలంలోని పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామమైన కేతవరంలో కొండపై ఉన్న లక్ష్మీ నరసింహుని ఆలయంలో గురువారం ప్రతిష్టా మహోత్సవం నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ ఈఓ అవుదూరి వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కొండ దిగువన గల స్వామివారి ఆలయం వద్ద జీవ ధ్వజ స్తంభం, పరివార దేవతల విగ్రహ ప్రతిష్ట ఉదయం 9 గంటలకు జరగనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిష్టలో భాగంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అభాగ్య శిశువుల కోసం 'ఊయల'



నరసరావుపేట: అభాగ్యులైన శిశువులను అక్కున చేర్చుకునేందుకు బుధవారం జిల్లా శిశు సంక్షేమం, సాధికారిత అధికారి ఆధ్వర్యంలో పెద్దచెరువులోని శిశుగృహంలో క్రెడిల్ బేబీ రెడెమ్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా అభాగ్యులైన శిశువులను చెత్తకుప్పలు, కాలువల్లో వేయకుండా బతకనిచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఊయలలో వేయాలని పీడీ ఉమాదేవి కోరారు. సూపరింటెండెంట్ లోకనాథం, నోడల్ అధికారి అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 518.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 4,050 క్యూసెక్కులు విడుదలవుతోంది.



కొండలు పిండి

- మంత్రి గొట్టిపాటి ఇలాకాలో గ్రావెల్ దందా
- ధర్మవరం ప్రాంతంలో కొండలను తవ్వి గ్రావెల్ అమ్మకం
- రోజుకు 300 లారీల గ్రావెల్, మట్టి తరలింపు
- ఎక్స్‌ప్రెస్‌వే రోడ్డు, రియల్ వెంచర్లకు గ్రావెల్ అమ్మకం
- లారీ గ్రావెల్ రూ.6 వేలు
- నెలకు రూ.4.5 కోట్ల అక్రమార్జన
- పోలీసు, రెవెన్యూ అధికారులకు మామూళ్లు



అద్దంకి మండలం ధర్మవరం సమీపంలోని కొండల నుంచి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్

సాక్షి ప్రతినిధి,బాపట్ల: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న అద్దంకి నియోజకవర్గంలో గ్రానైట్, రేషన్ దందాతో పాటు గ్రావెల్ అక్రమ రవాణా పతాకస్థాయికి చేరింది. మంత్రి అనుచరులు అద్దంకి మండల పరిధిలోని ధర్మవరం పెద్ద చెరువుతోపాటు పరిసర ప్రాంతాల్లోని ఇతర చెరువులు, ప్రభుత్వ భూములు, కొండలను తవ్వి గ్రావెల్‌తో పాటు మట్టిని తరలించి అమ్ముకుంటున్నారు. ఒక్కరోజుకు రూ.15 లక్షల చొప్పున నెలకు రూ.4.5 కోట్ల మేర అక్రమార్జన సాగిస్తున్నట్లు సమాచారం. పోలీసు, రెవెన్యూ అధికారులకు వాటా ఇస్తుండడంతో వారు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలున్నాయి.

రాత్రీపగలు తేడా లేకుండా తరలింపు

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చింది మొదలు ఇప్పటి వరకూ పచ్చనేతలు వందల ఎకరాలలో విస్తరించి ఉన్న అద్దంకి మండలం ధర్మవరం పెద్ద చెరువు నుంచి గ్రావెల్, మట్టిని తరలించి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. చెరువులో ఏకంగా యంత్రాలు, టిప్పర్లు పెట్టి రాత్రీపగలు తేడా లేకుండా రోజుకు వందల టిప్పుల గ్రావెల్‌ను తరలిస్తున్నారు. కొంత గ్రావెల్‌ను అమరావతి, అనంతపురం ఎక్స్‌ప్రెస్ రహదారికి తరలించగా మిగిలిన గ్రావెల్‌ను అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లోని రియల్ వెంచర్లకు అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. గడిచిన పది నెలల కాలంలో చెరువు మట్టి దాదాపుగా కొల్లగొట్టిన పచ్చనేతల కన్ను ఇప్పుడు ధర్మవరం ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములు, కొండలు, గుట్టలపై పడింది. గత కొద్దిరోజులుగా ధర్మవరం చెరువు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములు, కొండలను తవ్వి గ్రావెల్‌ను అక్రమ రవాణా చేస్తున్నారు. ఇందుకోసం పెద్దపెద్ద యంత్రాలను పెట్టారు. 300 లారీలను గ్రావెల్ తరలింపునకు వినియోగిస్తున్నారు. ధర్మవరానికి చెందిన పచ్చనేతతోపాటు మంత్రి ప్రధాన అనుచరుడు ఇందులో భాగస్వామిగా ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మంత్రి అనుచరులు కావడంతో అక్రమరవాణా అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదు.



గ్రావెల్ కోసం కొండను తవ్వుతున్న దృశ్యం

నెలకు రూ.4.5 కోట్ల అక్రమార్జన

పచ్చనేతల అక్రమ రవాణా వ్యాపారం రోజుకు రూ.కోట్లలోనే సాగుతున్నట్లు సమాచారం. ఒక్కో లారీ గ్రావెల్ రూ.5 నుంచి రూ.6 వేలకు అమ్ముతున్నారు. సగటున లారీ రూ.5 వేలు అనుకున్నా 300 లారీలకు రోజుకు రూ.15 లక్షల రాబడి ఉండగా నెలకు రూ.4.5 కోట్లకు తక్కువ లేకుండా అక్రమ సంపాదన ఉన్నట్లు పచ్చపార్టీ వర్గాల్లోనే ప్రచారం ఉంది.

అధికారులు గప్‌చిప్

రూ.కోట్లు కొల్లగొడుతున్న పచ్చనేతలు స్థానిక రెవెన్యూ, పోలీసుల అధికారులకు సైతం మామూళ్లు ముట్టజెపుతున్నట్లు ప్రచారం వుంది. అందువల్లే ధర్మవరం చెరువుతోపాటు ప్రభుత్వ భూములు, కొండలు, గుట్టలు తవ్వి గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికే అద్దంకి ప్రాంతంలోని గుండ్లకమ్మ ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న పచ్చనేతలు బల్లకురవ, సంతమాగులూరు ప్రాంతాలోని గ్రానైట్ పరిశ్రమల నుంచి పెద్దఎత్తున మట్టి, రాయిని వాడరేవు, పిడుగురాళ్ల రోడ్డుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు సృజనాత్మకత పెంపొందించుకోవాలి

జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్

చీరాల అర్బన్: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్ సూచించారు. ఏపీ విద్యాశాఖ, ఎస్సీఆర్టీ, సమగ్రశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో వ్యాపార నైపుణ్యాలను పెంపొందించి 21వ శతాబ్దపు వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా బుధవారం వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయి పోటీలను స్థానిక ఎన్‌ఆర్‌పీఎం హైస్కూల్‌లో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పది ప్రాజెక్టులు పాల్గొన్నారు. విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి ప్రదర్శనలకు జె.పంగులూరు మండలం బూదవాడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ఆయుర్వేదిక్ మెడిసిన్ ఫర్ కిడ్నీ ప్రోబ్లమ్స్ (ప్రకృతి వైద్యం), చీరాల ఎన్‌ఆర్‌పీఎం హైస్కూల్ విద్యార్థుల ధన్వంతరి-దంత సిరి (పళ్ల పొడి) ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. పోటీలకు న్యాయనిర్ణేతలుగా గీత యంగ్ సైంటిస్ట్ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, విశ్రాంత వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు అంగలకుదిటి నాగవీరభద్రాచారి వ్యవహరించారు. జిల్లా సైన్స్ సమన్వయకర్త పవని భానుచంద్రమూర్తి, ప్రధానోపాధ్యాయులు ఆలూరి వెంకటేశ్వరరావు, ఈఎండీపీ జిల్లా సమన్వయకర్త రమణకుమారి పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి ప్రాజెక్టులకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

సజావుగా జేఈఈ మెయిన్స్

- గుంటూరు, పల్నాడులోని పరీక్ష కేంద్రాల్లో నిర్వహణ
- ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా కంప్యూటర్ బేస్ టెస్ట్
- పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు విస్తృత తనిఖీలు

గుంటూరు ఎడ్యుకేషన్ : జాతీయస్థాయి సాంకేతిక విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశించేందుకు ఉద్దేశించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్-2025 రెండో సెషన్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా జరిగిన కంప్యూటర్ బేస్ట్ టెస్ట్ (సీబీటీ) లకు విద్యార్థులు హాజరయ్యారు. జేఈఈ మెయిన్స్ నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సీబీటీ విధానంలో ఆన్‌లైన్ పరీక్షల కోసం గుంటూరులో రెండు, పల్నాడు జిల్లాలో రెండు చొప్పున వివిధ ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు అయాన్ డిజిటల్ జోన్‌లలో ఏర్పాటు చేసిన కేంద్రాల పరిధిలో విద్యార్థులు ఆన్‌లైన్ పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు విస్తృత తనిఖీలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు హడావుడి పడుతూ పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఈనెల 3, 4, 7, 8వ తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టులలో పేపర్-1 (బీఈ, బీటెక్) ప్రవేశ పరీక్షలు జరగనుండగా, 9వ తేదీన పేపర్-2ఏ బీఆర్క్,పేపర్-2బీ బీ.ప్లానింగ్ పరీక్షలు జరగనున్నాయి.



పేరేచర్ల యూనివర్సల్ కళాశాలలో జేఈఈ మెయిన్స్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు

థియేటర్‌లో పరిచయంతో తోడుదొంగలై..



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, చిత్రంలో జిల్లా ఏఎస్పీ సుప్రజ, ట్రైనీ ఐపీఎస్ దీక్ష

- మహిళల మెడల్లో గొలుసుల చోరీ
- మూడేళ్లలో 13కు పైగా దొంగతనాలు
- పోలీస్‌స్టేషన్‌లలోనూ కేసుల్లేవు
- ఎట్టకేలకు దొరికిన దొంగలు
- రూ.32 లక్షల విలువ చేసే 390 గ్రాముల బంగారు సొత్తు స్వాధీనం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఓ సినిమా థియేటర్లో అయిన పరిచయంతో ఇద్దరూ స్నేహితులయ్యారు. ఆ తర్వాత ఆర్థిక కష్టాల దృష్ట్యా తోడుదొంగలై ఒంటరిగా వెళ్లే మహిళల మెడల్లో బంగారు గొలుసులే లక్ష్యంగా చోరీల బాట పట్టారు. మూడేళ్లలో 13కుపైగా దొంగతనాలు చేసినా ఏ పీఎస్ పరిధిలోనూ వీరిపై కేసులు నమోదు కాలేదు. ఎట్టకేలకు నల్లపాడు పోలీసులు వీరి ఆట కట్టించారు. ఇద్దరినీ అరెస్టు చేసి వారి వద్ద రూ.32 లక్షల విలువ చేసే 390 గ్రాముల బంగారు సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాలను ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. గత నెలలో నల్లపాడు పీఎస్ పరిధిలోని లింగయ్యపాలెం గ్రామంలో, గుంటూరు క్లబ్ దగ్గర్లో ఒంటరిగా నడిచి వెళ్లే మహిళల మెడల్లో దుండగులు బంగారు గొలుసులు తెంచుకెళ్లారు. దీనిపై బాధిత మహిళలు నల్లపాడు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ వంశీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను నిశితంగా పరిశీలించారు. ఏటుకూరు రోడ్ డీఎస్ నగర్ తొమ్మిదో వీధిలో ఉంటున్న టైలర్ వల్లెపు శ్రీనును అనుమానితుడిగా అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. అతనిచ్చిన సమాచారంతో వసంతరాయపురం నాలుగో వీధికి చెందిన అన్నపురెడ్డి శివ సుబ్రహ్మణ్యంను అరెస్టు చేశారు. వీరిద్దరూ కలిసి బంగారు గొలుసుల చోరీలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. వీరు గుంటూరు, బాపట్ల జిల్లాల్లో చోరీలకు పాల్పడినట్టు తేల్చారు. ఇప్పటివరకు 13కుపైగా చోరీలకు పాల్పడినా ఇప్పటివరకు వీరిపై కేసులు లేవని గుర్తించారు. వీరి వద్ద నుంచి రూ.32 లక్షల ఖరీదు చేసే 390 గ్రాముల బంగారు గొలుసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు. కేసును దర్యాప్తు చేసిన సీఐ వంశీధర్, ఎస్‌ఐ జనార్దన్, హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు, కానిస్టేబుళ్లు సాంబశివరావు, మస్తాన్‌వలి, బిక్షా నాయక్, వెంకటేశ్వర్లును ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో శిక్షణ ఐపీఎస్ అధికారిణి దీక్ష, ఏఎస్పీ సుప్రజ (క్రైం), డీఎస్పీ భానోదయ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలకు చిక్కకుండా ..

శివసుబ్రహ్మణ్యం 2009లో చీరాల నుంచి గుంటూరు వచ్చి స్థిరపడ్డాడు. తొలినాళ్లలో ఆటోడ్రైవర్‌గా పనిచేసేవాడు. 2018లో ఓ సినిమా థియేటర్‌లో శ్రీను పరిచయమయ్యాడు. ఇద్దరికీ ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో 2022 నుంచి చోరీలకు శ్రీకారం చుట్టారు. ఒంటరిగా వెళ్లే మహిళల మెడల్లో బంగారు గొలుసు తెంచుకెళ్లడం ప్రారంభించారు. స్కూటీపై వెళ్తూ గొలుసులు తెంచుకెళ్లే వారు. సీసీ కెమెరాలకు చిక్కకుండా, ఆధారాల్లేకుండా జాగ్రత్తపడటంలో వీరు నేర్పరులు. అందుకే వీరిద్దరిపై ఏ పీఎస్‌లోనూ కేసుల్లేవు. ధనవంతులు ఉండే ప్రదేశాల్లో ఎక్కువగా చోరీలు చేశారు. దొంగలించిన సొత్తును తెలిసిన వారి ద్వారా బంగారు దుకాణాల్లో విక్రయించేవారు. ఆ సొమ్ముతో అప్పులు తీర్చుకుని జల్సా చేసేవారు. వీరు పట్టాభిపురం పీఎస్ పరిధిలో 2, నల్లపాడు పీఎస్ పరిధిలో 4, తెనాలి వన్‌టౌన్ పరిధిలో 2, అరండల్ పేట పీఎస్, తెనాలి త్రీటౌన్ పీఎస్, చీరాల టూ టౌన్, చీరాల త్రీ టౌన్ పీఎస్ పరిధిలో ఒక్కొక్క చోరీ చేసినట్టు విచారణలో తేలింది.



గొలుసులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

ప్రభుత్వ వైద్యుల 'ప్రైవేటు' ప్రేమ

జవహర్‌నగర్‌కు చెందిన ఓ వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లింది. వైద్యుడు పరీక్షించి రక్త పరీక్షలు, కొన్ని మందులు రాశారు. ఇవి ఇక్కడ ఉండవని, చీరాలలోని సొంత హాస్పిటల్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకుని, మందులు తీసుకోవాలని డాక్టర్ తెలిపారు. అంత డబ్బులు తాను పెట్టుకోలేనని వృద్ధురాలు లబోదిబో అన్నా కనికరించలేదు. దీంతో ఆమె జిల్లా కలెక్టర్ వెంకట మురళికి గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేయడంతో ఆ వైద్యుడికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.



వైద్యసేవల కోసం ఏరియా వైద్యశాలకు వచ్చిన రోగులు

- మందులు, పరీక్షల పేరిట సొంత హాస్పిటల్స్‌కు రమ్మని రోగులకు సలహా
- ఓ వైద్యుడిపై గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు

చీరాల: జిల్లా ఆస్పత్రి కంటే చీరాల వైద్యశాలలో అన్ని హంగులు ఉన్నాయి. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు నిత్యం ఏరియా వైద్యశాలకు క్యూ కడతారు.ఆధునిక పరికరాలు, డయాలసిస్ యూనిట్, ఎంఆర్‌ఐ స్కాన్ తదితర కార్పొరేట్ హాస్పిటల్స్ సౌకర్యాలున్నా ఉపయోగ పడటం లేదు. వైద్యులు రోగులపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుండటంతో పాటు తమ ప్రైవేటు వైద్యశాలకు వస్తే త్వరగా నయం అవుతాయని మభ్యపెట్టి డబ్బులు దండుకుంటున్నారు. జిల్లాలోని బాపట్ల, అద్దంకి, రేపల్లె ప్రాంతాలలోని ప్రభుత్వ వైద్యశాలలు, విలేజ్ క్లినిక్‌లు, ప్రైమరీ హెల్త్ సెంటర్లలో పనిచేసే వైద్యులు 'ప్రైవేటు'పైనే ప్రేమ చూపిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు సరైన వైద్యం అందడం లేదు. జీతం ప్రభుత్వం వద్ద నుంచి తీసుకుంటున్నా సొంత ప్రాక్టీసుపైనే మక్కువ చూపుతున్నారు. ఒంగోలు, బాపట్ల జిల్లాలో చీరాల ప్రభుత్వ ఏరియా వైద్యశాల అతి పెద్దది. ఇందులో 19 మంది వైద్యులు ఉన్నారు. వీరిలో సగానికి పైగా వైద్యుల్లో సొంత ప్రాక్టీసు చేస్తుండగా మరికొందరు ప్రైవేటు ఆస్పత్రులలో పని చేస్తున్నారు. మెరుగైన వైద్యం, మందులు కావాలంటే తమ హాస్పిటల్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్లు ఉచిత సలహా ఇస్తున్నారు. అక్కడైతే తమ పర్యవేక్షణ ఉంటుందని, వైద్యం కూడా సత్వరం అందుతుందని నమ్మబలుకుతున్నారు.

వైద్యులున్నా వైద్యం సున్నా

సరైన సమయంలో డాక్టర్లు లేకపోతే నర్సులే వైద్యం అందిస్తున్నారు. డాక్టర్ గురించి అడిగితే వస్తారు... సెలవులో ఉన్నారనే అనే సమాధానం వినిపిస్తుంది. దీంతో వేరే విభాగానికి చెందిన డాక్టర్లు ఓపీలు చూస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు సరైన వైద్యం అందడం లేదు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మెరుగైన వైద్య సేవలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని హాస్పిటల్స్‌లో వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేసింది. సిబ్బంది సక్రమంగా పనిచేసేలా పర్యవేక్షణ ఉండేది. ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ఫ్యామిలీ డాక్టర్ విధానం, ఆరోగ్య సురక్ష, విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా పల్లెపల్లెలోనూ వైద్యసేవలు అందుబాటులో ఉండేవి. ఫలితంగా రోగులకు మెరుగైన వైద్యసేవలందేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. ఆస్పత్రికి వెళితే పట్టించుకునే నాథుడు కరువయ్యారని రోగులు బాధపడుతున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ ఏరియా వైద్యశాలల్లో పనిచేసే డాక్టర్లు వైద్యశాలకు వచ్చిన రోగులను ప్రైవేటు లేదా సొంత హాస్పిటల్స్‌కు మందులు, టెస్టుల పేరుతో పంపించకూడదు. ప్రభుత్వ వైద్యశాలల్లో జరుగుతున్న ఈ వ్యవహారంపై విచారించి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చిన రోగులను అక్కడే వైద్యం అందించాలి. డ్యూటీ వేళల తర్వాత బయట హాస్పిటల్స్‌లో పని చేయడంపై ఉన్నతాధికారులతో మాట్లాడతాం.

–డాక్టర్ శేషుకుమార్,
వైద్యవిధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం ఆధ్వర్యంలో ర్యాలీ

బాపట్ల: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరుతూ పట్టణంలో యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం అధ్యక్షులు ఎఫ్‌డబ్ల్యూ కోల్ ఆధ్వర్యంలో బుధవారం క్రైస్తవులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు.విలియం బూత్ కాలేజీ నుంచి అంబేడ్కర్ సర్కిల్, ఓల్డ్ బస్టాండ్, సీల్ రోడ్ సెంటర్ మీదగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ప్రవీణ్ పగడాల మృతిపై వెంటనే విచారణ చేపట్టాలి.. ఉయ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎఫ్.డబ్ల్యూ. కోల్ మాట్లాడుతూ గత నెల 24వ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి, మరణం యావత్తు తెలుగు రాష్ట్రాల హృదయాలను గాయపరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేసి న్యాయం చేయాలనికోరారు. క్రైస్తవులపై దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డెప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. సువార్తికుడు పగడాల ప్రవీణ్ పై అసాంఘిక శక్తులు కావాలనే అసత్య కథనాలు చేస్తున్నాయని, మెయిన్ స్ట్రీమ్ మీడియా కూడా అసత్య కథనాలు ప్రసారం దురదృష్టకరమని దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. శాంతియుతంగా ప్రార్థనలు చేసుకుంటూ సమాజం బాగుపడాలని కోరుకునే క్రైస్తవ లోకంపై ఈ విధమైన దాడులు అన్యాయం అని ఖండించారు. కార్యక్రమంలో రెవరెండ్ పవిత్ర కుమార్, రెవరెండ్ రాహుల్‌దేవ్, రెవరెండ్ కృపా ఏసురత్నం, రెవరెండ్ కృపాకర్‌రావు, పాస్టర్ అజయ్‌బాబు, బాబూరావు, మేజర్ ఏసుపాదం, పాస్టర్ చెల్లి అశోక్‌కుమార్, దళిత సంఘ నాయకులు చారువాక, మణిభూషణ్, జాన్ వెస్లీ, పాస్టర్ సువర్ణ రాజు, పాస్టర్ గమలియేల్, సంఘ కాపరులు, సంఘ పెద్దలు, క్రైస్తవులు పాల్గొన్నారు.



పాత బస్టాండ్ వద్ద రాస్తారోకో చేస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

క్లుప్తంగా

విద్యుత్ తీగలు తగిలి వరి గడ్డి దగ్ధం



మార్టూరు : విద్యుత్తు తీగెలు తగిలి వరి గడ్డి దగ్ధమైన సంఘటన మండలంలోని కోలలపూడిలో బుధవారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన బుద్దాం శ్రీనివాసరావు తన ట్రాక్టర్‌పై అదే గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలోని వరి గడ్డిని తరలిస్తున్నాడు. నాగండ్ల, కోలలపూడిరోడ్డులో ఎస్సీ కాలనీ ఎదురు విద్యుత్ తీగెలు తగిలి ఒక్కసారిగా మంటలు రేగాయి. ప్రమాదాన్ని గ్రహించిన శ్రీనివాసరావు గడ్డిని రోడ్డుపై జారవిడిచి ట్రాక్టర్‌ను తప్పించడంతో ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారంతో అద్దంకి నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి, ఇళ్ల మధ్య మంటలను అదుపులోకి తెచ్చారు.

రెండు గ్రామాల్లో చైన్ స్నాచింగ్

మేదరమెట్ల: రెండు గ్రామాల్లో మహిళల మెడల్లోంచి బంగారు గొలుసులను దొంగలు లాక్కెళ్లిన సంఘటనలు మంగళవారం రాత్రి జరిగాయి. బాధితులు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మేదరమెట్ల గ్రామానికి చెందిన జాలం ఉష రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తుల బైకు మీద వచ్చి మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును లాక్కెళ్లారు. మండలంలోని తిమ్మనపాలెంలో సీతమ్మ కుక్కపిల్లను తీసుకుని రోడ్డుకు రాగానే గుర్తు తెలియని ఇద్దరు యువకులు బైకు మీద వచ్చి మెడలోని మూడున్నర సవర్ల బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ మహ్మద్ రఫీ తెలిపారు.

యార్డుకు 1,30,848 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,30,848 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,28,132 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,600 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 56,061 బస్తాలు నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

వైద్య సిబ్బంది 8వ తేదీలోగా అభ్యంతరాలు తెలపాలి

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి కార్యాలయం పరిధిలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల చేసినట్లు జిల్లా వైద్యశాలల సమన్వయ అధికారి ఎం.మజిదాబి తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు గుంటూరు పట్టాభిపురంలోని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కార్యాలయంలో నేరుగా వచ్చి తెలియజేయాలన్నారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

ఆర్థిక స్వావలంబనతో మహిళల్లో ఆత్మవిశ్వాసం

బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పి.ప్రసూనారాణి

బాపట్ల: ఆర్థిక స్వావలంబనతో మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పి.ప్రసూనారాణి అన్నారు. ఐసీఏఆర్ ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా వ్యవసాయ కళాశాల జీవ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఈపూరుపాలెంలో స్వయం ఉపాధి కల్పన నైపుణ్యాలపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రసూనారాణి మాట్లాడుతూ మహిళలంతా చేతివృత్తుల్లో నైపుణ్యం పెంచుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుచుకోవాలని సూచించారు. వ్యక్తిగతంగా ఎదగడంతో పాటు వ్యాపారవేత్తలుగా రాణించాలని తెలిపారు. ఈపూరుపాలేనికి చెందిన కార్యంపూడి సుబ్బారావు హ్యాండ్ పెయింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్‌పై అవగాహన కల్పించారు. జీవ రసాయన శాస్త్ర విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ ఎం.సంధ్య సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ శిక్షణ కార్యక్రమంలో కె.హేమ, కె.సుశీల, ఎం.సువర్ణల పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న మహిళలు

పెట్రోలు క్యాన్‌తో మహిళ ఆందోళన

పోలీసుల హామీతో విరమణ

చీరాల: తీసుకున్న అప్పు ఇవ్వలేదని ఓ మహిళ పెట్రోలు క్యాన్‌తో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. సకాలంలో స్పందించిన పోలీసులు ఆమె వద్ద నుంచి క్యాన్‌ను తీసుకోవడంతో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే... చీరాల జవహర్‌నగర్‌కు చెందిన మచ్చా తాతమ్మ హరిప్రసాద్‌నగర్‌కు చెందిన మరకా సురేష్‌కు రూ.కోటి రూపాయలు అప్పుగా ఇచ్చానని, సంవత్సరాలు గడిచినా ఇవ్వకుండా తనను వేధిస్తున్నాడని పేర్కొంది. పలుమార్లు ఇంటికి వెళ్లినా చీరాలలో ఉండకపోవడంతో తాను మోసపోయానని తెలిపింది. తనకు న్యాయం చేయాలంటూ సురేష్ బంధువులకు చెందిన వైన్ షాపు వద్ద బుధవారం రాత్రి పెట్రోలు క్యాన్‌తో గంటకు పైగా ఆందోళన చేసింది. స్పందించిన పోలీసులు వైన్ షాపును తాత్కాలికంగా మూసివేయించి ఆమెను అక్కడి నుంచి తరలించారు. ఫిర్యాదు చేస్తే అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చారు.



వైన్ షాపు ముందు ఆందోళన చేస్తున్న మహిళ

పొగాకు రైతులకు ఆత్మహత్యలే శరణ్యం

- ధరలు దారుణంగా పడిపోయాయి
- ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి
- సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు కల్లూరి శ్రీనివాసరావు ఆవేదన

ప్రత్తిపాడు: పొగాకు ధరలు దారుణంగా పడిపోయాయని, ఇదే పరిస్థితి కొనసాగితే త్వరలో రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి పరిణమిస్తుందని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు కల్లూరి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. దీనికి హాజరైన తిమ్మాపురం సర్పంచ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు పొగాకు రైతుల దైన్యంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నిరుడు ధర రూ 15 వేలు ఉందని, ఇప్పుడు ఆరు వేలు కూడా లేదని ప్రశ్నించారు. రైతుల దీనస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. పొగాకుకు గత ఏడాది భారీగా ధర వచ్చిందని, దీంతో ఈ ఏడాది సెంటు భూమి లేని రైతులు కూడా పొలాలు కౌలుకు తీసుకుని సాగు చేశారని పేర్కొన్నారు. పత్తి, మిర్చి పంటలు తెగుళ్ళతో పోతున్నాయని, దీంతో రైతులంతా పొగాకు మీదనే ఆధారపడ్డారని తెలిపారు. పొగాకు సాగుకు ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి అయ్యిందని, ధర చూస్తే రూ.ఆరువేలు కూడా పలకడం లేదని ఆవేదన చెందారు. పొగాకు రైతులు ఆత్మహత్యలకు పాల్పడితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు

హ్యూమన్ రైట్స్, ఏసీబీ ఫోర్స్ లీగల్ కమిటీ ఎంపిక

మాచర్ల: రాష్ట్రంలో అవినీతి నిరోధక మానవ హక్కుల పరిరక్షణ, హ్యూమన్ రైట్స్ ఫోర్స్ సంస్థకు మాచర్ల పట్టణానికి చెందిన ఇరువురు న్యాయవాదులను రాష్ట్ర, జిల్లా లీగల్ ఇన్‌చార్జిలుగా నియమిస్తూ బుధవారం ఫౌండర్ దేవానంద్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది భవనం వెంకట నరసింహారెడ్డిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లీగల్ సెల్ అడ్వైజర్‌గా ఆర్‌జీఎన్, ఏసీబీ తరపున ఎంపిక చేసి ఉత్తర్వులు అందించారు. మరో న్యాయవాది చల్లా వెంకటేశ్వరరావును పల్నాడు జిల్లా సంస్థ ఇన్‌ఛార్జిగా, జిల్లా లీగల్ అడ్వైజర్‌గా నియమించి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మానవ హక్కుల పరిరక్షణకు సంస్థ తరపున కృషి చేస్తామన్నారు. వీరిని పలువురు అభినందించారు.



చల్లా వెంకటేశ్వరరావు



భవనం నర్సిరెడ్డి

అంగన్‌వాడీ కేంద్రాలకు మురిగి పోయిన కోడిగుడ్లు



బల్లికురవ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మురిగిపోయిన కోడి గుడ్ల సరఫరాతో చిన్నారులు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. బల్లికురవలోని అంగన్‌వాడీ కేంద్రం నుంచి బుధవారం చల్లగుండ్ల శ్రీనివాసరావు కుమార్తె పూజితకు పౌష్టికాహారం కింద 13 కోడిగుడ్లను పంపిణీ చేశారు. ఇందులో 12 మురిగిపోయి ఉన్నాయి. కాంట్రాక్టర్ నుంచి బుధవారమే కేంద్రానికి కోడిగుడ్లు సరఫరా కావడం విశేషం. ఈ విషయాన్ని సీడీపీవో డి. సుధ దృష్టికి తీసుకెళ్లగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి మంచి కోడిగుడ్లు అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసేలా చర్యలు చేపతామని తెలిపారు.

రేవుల హక్కులపై జెడ్పీలో బహిరంగ వేలం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా కృష్ణానదీ పరివాహక ప్రాంతంలోని 11 రేవుల్లో పడవలు, బల్లకట్లు నడుపుకునేందుకు బుధవారం జెడ్పీ సమవేశ మందిరంలో సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలం ప్రక్రియ నిర్వహించారు. జెడ్పీ డెప్యూటీ సీఈఓ సీహెచ్ కృష్ణ పర్యవేక్షణలో నిర్వహించిన సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలంలో ఏడు రేవులను పాటదారులు దక్కించుకోగా, నాలుగు రేవులకు పాటదారులు పాల్గొనకపోవడంతో వాయిదా వేశారు. అచ్చంపేట, మాచవరం, అమరావతి, కొల్లిపర మండలాల పరిధిలోని చామర్రు, గింజుపల్లి, తాడువాయి, మాదిపాడు, దిడుగు, ధరణికోట రేవుల్లో పడవ, పుట్లగూడెంలో బల్లకట్టును వచ్చే ఏడాది మార్చి 31 వరకు తిప్పుకునేందుకు నిర్వహించిన వేలంలో పాటదారుల నుంచి జెడ్పీకి మొత్తం రూ.1,46,07,526 ఆదాయం సమకూరింది. కాగా చింతపల్లి, వల్లభాపురంలో పడవ, మాదిపాడు, గోవిందాపురంలో బల్లకట్టు వేలంలో పాటదారులు ఆసక్తి చూపలేదు. వేలం ప్రక్రియలో జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చర్లపల్లి-విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైలు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): చర్లపల్లి-విశాఖపట్నం మధ్య వేసవి ప్రత్యేక రైలును నడపనున్నట్లు గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ బుధవారం తెలిపారు. చర్లపల్లి-విశాఖపట్నం వయా గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైలు(07011) ఈనెల 3న చర్లపల్లి స్టేషన్ నుంచి రాత్రి 8.15 గంటలకు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు విశాఖపట్నం స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు.

దళితులపై వివక్ష చూపుతున్న కూటమి ప్రభుత్వం

మాల మహానాడు బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేడికొండ సునీల్

చినగంజాం: జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటులో కూటమి ప్రభుత్వం దళితులు, బీసీల మధ్య వ్యత్యాసం చూపిస్తోందని మాల మహానాడు బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేడికొండ సునీల్ బుధవారం విమర్శించారు. దళిత, గిరిజన బలహీనవర్గాలకు మందుల రేట్లు అందుబాటులో ఉండేందుకు జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. అయితే, ప్రభుత్వ ఉత్తర్వులు చూస్తే దళితులకు, బలహీనవర్గాలకు వ్యత్యాసం కనిపిస్తోందని పేర్కొన్నారు. బీసీలు జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటు చేసుకుంటే రూ. 8 లక్షలు ప్రభుత్వం ఇస్తే రూ. 4 లక్షలు సబ్సిడీగా ప్రకటించారని చెప్పారు. అదే ఎస్సీలకు ప్రభుత్వం రూ. 5 లక్షలు ఇస్తే రూ. 2 లక్షలు మాత్రమే సబ్సిడీగా ప్రకటించారని, ఈ తేడా ఏమిటని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం దళితులపై వివక్ష చూపుతోందనేది అర్థమవుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి బీసీలకు ఇచ్చిన విధంగానే ఎస్సీలకు కూడా రుణ విలువ రూ. 8 లక్షలు పెంచి, రూ. 4 లక్షలు సబ్సిడీ ఇవ్వాలని ఆయన కోరారు. బీసీలకు, ఎస్సీలకు సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఏఐ ద్వారా క్యాన్సర్ చికిత్సలు

నేడు గుంటూరు జీజీహెచ్‌లో లాంఛనంగా ప్రారంభం

గుంటూరు మెడికల్: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో క్యాన్సర్ చికిత్సలు చేసేందుకు కొత్త కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గురువారం గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో డీఎంఈ ప్రారంభించనున్నట్లు ఆస్పత్రి అధికారులు తెలిపారు. తొలుత విశాఖపట్నం కింగ్ జార్జ్ హాస్పిటల్, కాకినాడ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, గుంటూరు జీజీహెచ్, కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లలో నవ్య కేర్ నెట్‌వర్క్ ప్రైవేటు లిమిటెడ్ నేషనల్ క్యాన్సర్ గ్రిడ్, ఆంధ్రప్రదేశ్ చాప్టర్‌తో ఏఐ ద్వారా చికిత్సలు అందించేందుకు ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టులుగా రంగం సిద్ధం చేసింది. ఈ సందర్భంగా బుధవారం గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ రేడియేషన్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ గిరిజవోలు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ టీఎంసీ, ఎన్‌సీజీ నవ్య పైలట్ ప్రాజెక్ట్‌లో పనిచేయడానికి తాము చాలా సంతోషిస్తున్నామని పేర్కొన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎంఎల్ టెక్నాలజీతో క్యాన్సర్‌పై రోగులు, వారి బంధువుల్లో ఉండే ఆందోళనను తొలగించే అవకాశం ఉంటుందని, సెకండ్ ఒపీనియన్ తీసుకునేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ మట్లాడుతూ రోగులు తమ సొంత జిల్లాల్లోనే సత్వర క్యాన్సర్ వైద్యం పొందేందుకు ప్రభుత్వం నూతనంగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందని పేర్కొన్నారు.

జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా కిరణ్మయి



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా చిలువూరి కిరణ్మయి బుధవారం విధుల్లో చేరారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణను కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. ప్రస్తుతం మంగళగిరి టీబీ శానిటోరియం హాస్పిటల్‌లో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా కిరణ్మయి విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతి పొంది గుంటూరు జీజీహెచ్ గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరారు. గుంటూరు జిల్లాకు చెందిన కిరణ్మయి సికింద్రాబాద్ గాంధీలో జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్ఎం) కోర్సు 2000లో పూర్తి చేశారు. మెదక్ జిల్లా సిద్దిపేట పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సుగా 2001 జనవరిలో చేరి ప్రభుత్వ సర్వీసులో ప్రవేశించారు. హెడ్ నర్సుగా 2007లో ఉద్యోగోన్నతి పొంది నిజామాబాద్ పీచ్‌పల్లికి బదిలీ అయ్యారు. అనంతరం తెలంగాణ నుంచి ఏపీకి ప్రత్యేక బదిలీ అయి 2008లో గోరంట్లలోని జ్వరాల ఆస్పత్రిలో చేరారు. 2018 వరకు అక్కడే పనిచేసి గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. అనంతరం మంగళగిరి బదిలీ అయ్యారు. ఇప్పుడు గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరిన కిరణ్మయికి పలువురు నర్సింగ్ సిబ్బంది, నర్సింగ్ యూనియన్ అధికారులు, వైద్య సిబ్బంది, వైద్యులు అభినందనలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో సమృద్ధిగా సూక్ష్మపోషకాలు

బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేయడం, అంతర పంటలను పండించడం ద్వారా అధిక దిగుబడి, ఆదాయంతో పాటు భూమిలో సూక్ష్మ పోషకాలు వృద్ధి చెందుతాయని అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్ తెలిపారు. బుధవారం మండలంలోని నాగిరెడ్డిపాలెం, పాపాయపాలెం గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ విధానంపై గ్రామ సభలు నిర్వహించారు. అడిషనల్ డీపీఎం మాట్లాడుతూ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ 2025- 26 సంవత్సరంలో ప్రకృతి వ్యవసాయం చేసే ప్రతి రైతు భూమి విస్తీర్ణం, పంటలు, పాడి పశువుల వివరాలను సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు. గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయం ముందుకు తీసుకువెళ్లే విధంగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ఎస్ఎఫ్ఏ సైదయ్య, వీఏఏలు అయ్యప్ప, వంశీ పాల్గొన్నారు.



నాగిరెడ్డిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది, నాయకులు

సహజీవనానికి అడ్డు వస్తుందని చిన్నారికి చిత్రహింసలు

మంగళగిరి: సహజీవనానికి అడ్డు వస్తుదన్న అక్కసుతో తల్లి, పెద్దనాన్న చిన్నారిని చిత్రహింసలు పెట్టి గాయపరిచిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిన్నారి అమ్మమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. తాడేపల్లి మండలం గుండిమెడకు చెందిన మరియమ్మకు ఇద్దరు ఆడపిల్లలు. ఇద్దరికీ పెళ్లిళ్లయ్యాయి. చిన్నకుమార్తె ప్రీతి అక్క భర్త నాగేంద్రబాబుతో ప్రేమలో పడి సహజీనం చేస్తోంది. దీనిని గమనించిన ప్రీతి భర్త ఆమెను వదిలేసి వెళ్లిపోయాడు. ప్రీతికి మూడేళ్ల పాప ఉంది. దీంతో పాపతో సహా ప్రీతి, నాగేంద్రబాబు చినకాకానిలో అపార్ట్‌మెంట్ అద్దెకు తీసుకుని మూడునెలలుగా నివాసం ఉంటున్నారు. తమ బంధానికి అడ్డు వస్తుందన్న అక్కసుతో కొద్ది రోజులుగా నాగేంద్రబాబు పాపను కొట్టి చిత్రహింసలు పెడుతున్నాడు. పాపను అమ్మమ్మతో ఉండాలని ఒత్తిడి చేస్తున్నాడు. మంగళవారం రాత్రి నాగేంద్రబాబు ఇంటికి వచ్చేసరికి పాప ఏడుస్తుండడంతో కోపంతో ఊగిపోయాడు. దారుణంగా కొట్టాడు. ప్రీతి కూడా అడ్డు చెప్పలేదు. సమాచారం తెలుసుకున్న అమ్మమ్మ మరియమ్మ పాపను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించింది. బుధవారం మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయాలతో చిన్నపాప

బ్లేడ్‌తో ఇద్దరిపై దాడి

సత్తెనపల్లి: బ్లేడుతో ఇద్దరిపై యువకుడు దాడి చేసిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని శ్రీరామ్ నగర్‌లో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన గింజుపల్లి అశోక్ కుమార్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం పూటుగా మద్యం తాగాడు. ఇంటి సమీపంలోని ఎనిమిదో తరగతి చదువుతున్న మేడూరు చాణిక్యతో ఏంటిరా.. నా వైపు చూస్తున్నావ్ ! అంటూ దూషించి దాడి చేసి బెదిరించడంతో చాణిక్య వెంటనే తల్లి మేడూరు జ్యోతికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ఎయిర్‌టెల్ కార్యాలయంలో పనిచేస్తున్న జ్యోతి తన బిడ్డ చాణిక్యపై దాడి చేస్తున్నారంటూ చూసి రమ్మని తన వద్ద పనిచేసే ఏల్చూరి నవీన్, తూమాటి శ్రీకాంత్‌లను పంపింది. వారు ఘటన స్థలానికి చేరుకొని ఎందుకు దాడి చేసి, బెదిరిస్తున్నావు అంటూ ప్రశ్నించారు. దీంతో అశోక్ కుమార్ బ్లేడ్ తీసుకొని ఏల్చూరి నవీన్ మెడ, చెవి పైన, తూమాటి శ్రీకాంత్ చేతులపై దాడి చేశాడు. ఎవరైనా దగ్గరకు వస్తే దాడి తప్పదు అంటూ బ్లేడు చూపిస్తూ హల్‌చల్ చేయడంతో స్థానికులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పట్టణ ఏఎస్ఐ సుబ్బారావు వరాసైన అశోక్ కుమార్‌ను క్రిస్టియన్ పేటలో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గాయాలపాలైన ఏల్చూరి నవీన్‌ను ఏరియా వైద్యశాలకు తరలించగా, వైద్యులు 10 కుట్లు వేశారు. తూమాటి శ్రీకాంత్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు.